సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 28 । జూన్ । 2024



ఎడ్‌సెట్‌లో అమ్మాయిల సత్తా

ఏపీ ఎడ్‌సెట్–2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. 8లో



త్రిశంకు స్వర్గంలో..

స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. 8లో



పెంపుడు కుక్కలతో జాగ్రత్త!

కుక్కలు ఒక్కోసారి ప్రేమతోనో, కోపంతోనో కాటేస్తుంటాయి. ఏమీ కాదులే అని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. 8లో

న్యూస్‌రీల్

విశాఖలో కేంద్ర వైద్య బృందం పర్యటన



డీఎంహెచ్‌వోతో సమావేశమైన కేంద్ర బృంద సభ్యులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖకు చెందిన కేంద్ర బృంద సభ్యులు జితేంద్ర, ఎస్.పూజ గురువారం విశాఖలో పర్యటించారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మధురవాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రేసవానిపాలెంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావుతో సమావేశమయ్యారు. చిన్నారులకు అందించే ఐరన్ సిరప్‌లు, మాత్రలు గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కార్యక్రమం కింద అందజేసే ఐరన్ టాబ్లెట్ విధానం గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఎస్.జీవన్‌రాణి, ప్రోగ్రామ్ అధికారి ఎస్.సమత, నోడల్ అధికారి బి.ఉమావతి, వివిధ విభాగాల అధికారులు ప్రశాంతి, హీన దీక్షిత్, ఐ.మనోరమ, శాంతిప్రియ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి కేకే లైన్ డబ్లింగ్ పనుల పూర్తి



టన్నెల్ వద్ద బ్లాస్టింగ్ పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో 100 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కేకే లైన్‌లో జరుగుతున్న రెండో లైన్ పనులను కొత్తవలస–అరకు స్టేషన్ల మధ్య ఆయన పరిశీలించారు. గురువారం ఫేస్ బ్లాస్టింగ్ ద్వారా బొడ్డవర – శివలింగపురం మధ్య గల 5వ నంబర్ గుహ వద్ద సుమారు 1.4 కిలోమీటర్ల పొడవైన గుహను తొలగించడం ఓ మైలురాయి అని తెలిపారు. ఈ మార్గంలో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, కష్టతరమైన బొడ్డవర–శివలింగపురం మార్గంలో గల 6 టన్నెల్స్‌లో 4 టన్నెల్స్ నిర్మాణం చేపట్టి, ఇప్పటికే పూర్తిచేసినట్లు తెలిపారు. మార్చి 2026 కల్లా ఈ లైన్ పూర్తి చేసే దిశగా పనులు పూర్తి చేస్తున్నట్లు డీఆర్ఎం తెఇపారు. 189 కిలోమీటర్లు పొడవైన కోరాపుట్–కొత్తవలస సెక్షన్‌లో ఇప్పటి వరకు 96.45కిలోమీటర్ల మేర రెండో లైన్ పనులు పూర్తిచేసినట్లు, ఆగస్టు 15వ తేదీకి 100కిలోమీటర్లు పూర్తి కావస్తుందని తెలిపారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట: జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయమూర్తి ఎ.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్‌లో ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎం.పోలినాయుడు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి , ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

బరువును మించి.. బడి సంచి!



ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి బడి బ్యాగులో టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్ అన్నీ కలిపి 35 వరకు ఉన్నాయి. స్కూల్ బ్యాగు బరువు నాలుగు కిలోలపైనే ఉంది. దీనికి తోడు మధ్యాహ్న భోజనం, వాటర్ బాటిల్ వీటన్నింటినీ భుజాలపై మోసుకుని వెళ్లడంతో వారం రోజులకే ఆ విద్యార్థికి మెడనొప్పి మొదలైంది. నగరంలోని పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్తే.. మెడపై అధిక భారం పడిందని, బాబుతో బరువులు మోయించవద్దని సూచించారు. 'ఆ బరువు, బడి సంచి' అని తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు ఆలోచనలో పడ్డారు.

- ప్రైవేట్‌లో సొంత సిలబస్ బోధన
- చిన్నారులపై పుస్తకాల భారం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఎస్‌సీఈఆర్టీ నిబంధనలు పట్టని యాజమన్యాలు
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు



విశాఖలోని ఓ ప్రైవేటు స్కూల్ నుంచి పిల్లలకు పుస్తకాలు కొనుగోలు చేసి తీసుకొస్తున్న తల్లి

విశాఖ విద్య: ఆహ్లాదంగా సాగాల్సిన చిన్నారుల చదువులు భారమైపోతున్నాయి. బుడిబుడి అడుగులు వేస్తూ హాయిగా చదువుకోవాల్సిన పిల్లలపై పోటీతత్వం కారణంగా ఒత్తిడి పెరుగుతోంది. తమ స్కూల్ ప్రథమ స్థానంలో ఉండాలని ఆయా యాజమాన్యాలు భావిస్తుండడంతో పిల్లలకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో పుస్తకాల మోత పెరిగింది. ఫలితంగా ఎల్‌కేజీ, యూకేజీ నుంచే బరువైన బ్యాగులతో బహుళ అంతస్తులు ఎక్కాల్సి వస్తోంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక చిన్నారుల పడుతున్న వేదన వర్ణణాతీతం. గతేడాది లెక్కల ప్రకారం జిల్లాలో 1,387 పాఠశాలలు ఉండగా వీటిలో 781 స్కూళ్లు ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో 3,94,334 మంది విద్యనభ్యసిస్తుండగా, వీరిలో 2,98,330 మంది ప్రైవేట్ స్కూళ్లకే వెళ్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న మోజు ఏ తీరుగా ఉందో ఈ లెక్కలే చెబుతున్నాయి.

అవసరం లేకున్నా...

ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ప్రస్తుతం ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ నగరంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో తమ సొంత సిలబస్‌తో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అంటగడుతున్నారు. వాస్తవంగా అయితే ఆరు సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు, వీటికి నోట్స్ పుస్తకాలు, మహా అయితే డిక్షనరీ, డైరీ వంటివి కలిపి ఎంత లేదన్నా 15 వరకు పుస్తకాలు ఉంటాయి. కానీ ప్రైవేట్‌లో మాత్రం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతో పాటు, ప్రింటెడ్ వర్క్‌బుక్స్, హోం వర్క్, రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్, లాంగ్వేజీ డిక్షనరీ, డ్రాయింగ్ ఇలా 30 నుంచి 35 వరకు పుస్తకాలు ఉంటున్నాయి. దీంతో బడి సంచి బరువెక్కి, చిన్నారులకు భుజాల నొప్పిలు తెప్పిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలివే...

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలురకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందని పేర్కొంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చంటున్నారు. చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినటమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొంటున్నారు.

బరువుల భారంలో తేడా ఇలా..

పిల్లలను బాగా చదివించుకోవాలనే తల్లిదండ్రుల తపనతో నగరంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు లేత భుజాలపై మోయలేని భారం వేస్తున్నారు. విద్యార్థుల బడి సంచి బరువుపై 2017లోనే ప్రభుత్వం జీవో నం. 22 విడుదల చేసింది. దాని ప్రకారమే తరగతుల వారీగా అన్ని యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో పుస్తకాల సంచి బరువు ఉండాలని స్పష్టం చేసింది. ప్రైవేట్ స్కూళ్లపై విద్యాశాఖ పర్యవేక్షణ సవ్యంగా లేకపోవడంతో నగరంలో నిబంధనలు అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పుస్తకాల సంచి బరువు ఇలా...(కేజీల్లో)

తరగతి	ప్రభుత్వ	ప్రైవేటు
1 నుంచి 2	1–2	6–7
3 నుంచి 5	2–3	9–16
6 నుంచి 7	4	18–23
8 నుంచి 9	4–5	23–25
10	5	25పైనే

బరువు తగ్గించాల్సిందే..



విద్యార్థులపై మోయలేని రీతిలో పుస్తకాలు భారం మోపడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు. దీనిపై కమిషన్ ద్వారా ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చాం. అధిక బరువు పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. దీనిపై తక్షణమే విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ జి. సీతారాం, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు



ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు విక్రయించకూడదు. అలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకుంటాం . పిల్లలను తమ వద్దనే పుస్తకాలు కొనాలని ఒత్తిడి చేస్తే అలాంటి స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తాం. ఎస్‌సీఈఆర్టీ నిబంధనలకు అనుగుణంగానే పుస్తకాల బరువు ఉండాలి.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ, విశాఖ పట్నం

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా సామాజిక భద్రత పింఛన్లను జూలై ఒకటో తేదీన ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,64,139 మంది పింఛన్‌దారులందరికీ ఒక్క రోజులోనే గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు సొమ్ము పంపిణీ చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో అనుసరించాల్సిన విధివిధానాలపై గురువారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.112.21 కోట్లను కేటాయించిందని, ఈ నెల 29వ తేదీ శనివారం బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి పింఛన్‌దారుల ఇంటి వద్దే సొమ్ము పంపిణీ చేసేందుకు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం మేర ఇతర శాఖ ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు చొప్పున అప్పగించేందుకు క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఒకే రోజు ఈ కార్యక్రమం పూర్తి చేయాలని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరైనా మిగిలిపోతే రెండో రోజు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆధార్ బయోమెట్రిక్, ముఖ ఆధారితంగానే పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని, పింఛన్ పంపిణీ ధ్రువీకరణపత్రాన్ని కూడా జారీ చేయాలని ఆయన ఆదేశించారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

జిల్లాలో జూలై ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ పింఛన్లు పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి పింఛన్ల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి, యూసీడీ పీడీ ఎం.వి.డి ఫణిరామ్, తదితరులు పాల్గొన్నారు.

రోజంతా వాన

సాగర నగరి చల్లబడింది.. బుధవారం నాడు ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు. కొన్ని రోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు సేదతీరారు. నగరంలో నేడు, రేపు పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో..



ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులో..

నీలి నీలి ఆకాశం..!



నీలిరంగు పులుముకున్న ఆకాశం సంద్రాన్ని ముద్దాడింది. ఆహ్లాదకర మబ్బుల వాతావరణం నగరానికి కొత్తందాన్ని తీసుకొచ్చింది.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు



టూర్స్ వివరాలను వెల్లడిస్తున్న క్రాంతి సావర్కర్

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాల సందర్శించాలనుకునే భక్తులు, పర్యాటక యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెడుతున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు. ఉత్తరాంధ్ర వారి కోసం విశాఖ నుంచే పలు జాతీయ, అంతర్జాతీయ ప్యాకేజీలను మొట్టమొదటిసారి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఎల్‌టీసీ, ఎల్ఎఫ్‌సీ వంటి సదుపాయాలు కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీలు కాకుండా డైరెక్టుగా కస్టమర్స్‌కు కావలసిన ప్యాకేజీలను కూడా రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఆమెతో పాటు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ (భువనేశ్వర్) సంఘమిత్ర రౌల్, సిబ్బంది పాల్గొన్నారు.

టూర్‌ల వివరాలు

మేజికల్ థాయ్‌లాండ్ : ఈ టూర్ విశాఖలో మొదలై, విశాఖలో ముగుస్తుంది. మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7న మొదలై 12వ తేదీన ముగుస్తుంది. విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలోని నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారి వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లోని గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. భోజనం, అల్పాహారం, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సియింగ్, ఇన్సూరెన్స్‌తో కలిపి ఒకొక్కరికి రూ.57,815.

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీన విశాఖలో ముగుస్తుంది. దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్ సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి రూ.38,005 చార్జీ చేస్తారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర (విశాఖ నుంచి) : మానస్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో దేవ్‌భూమి ఉత్తరాంఖండ్ యాత్ర. ఇది విశాఖ నుంచి ప్రారంభిస్తున్న మొదటి యాత్ర. మొత్తం థర్డ్ ఏసీ కోచ్‌లతో కూడిన ప్రత్యేక రైలు విశాఖ నుంచి ప్రారంభమవు తుంది. మొత్తం 11రాత్రులు, 12 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ జూలై 26న విశాఖలో ప్రారంభమై ఆగష్టు 8వ తేదీన విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో భీమ్‌టాల్ నైనిటాల్, కైంచి ధామ్, కసర్‌దేవి, కతర్‌మల్ సన్ టెంపుల్, జగదీశ్వర్ ధామ్, గోలు దేవత, అల్మోరా, బైజనాథ్, బాఘేశ్వర్, కౌసని, రాణికేత్ వంటి ప్రాంతాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి రైలు థర్డ్ ఏసీ, హోటల్ వసతి, నాన్ ఏసీ, ఏసీ వాహనాల్లో సైట్ సీయింగ్, భోజనం, టిఫిన్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి స్టాండర్డ్ అయితే రూ.28,020, డీలక్స్ అయితే రూ.35,340 ఉంటుంది.

మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్–92810 30748, సాయిప్రసాద్ – 92814 95847, కేవీ రావు – 95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

మరి కొంతకాలం స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రద్దీ మార్గాల్లో ప్రత్యేక వీక్లీ స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–సికింద్రాబాద్(08579) వీక్లీ స్పెషల్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరునటి రోజు ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు జూలై 3 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు పొడిగించారు. సికింద్రాబాద్–విశాఖపట్నం (08580) వీక్లీ స్పెషల్ సికింద్రాబాద్‌లో ప్రతీ గురువారం రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 4 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు పొడిగించారు.
- విశాఖపట్నం–తిరుపతి(08583) వీక్లీ స్పెషల్ విశాఖపట్నంలో ప్రతీ సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుపతి–విశాఖపట్నం(08584) స్పెషల్ తిరుపతిలో ప్రతీ మంగళవారం రాత్రి 9.55 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 2 నుంచి ఆగస్టు 27వ తేదీ వరకు పొడిగించారు.
- న్యూటిన్‌సుకియా–ఎస్ఎంవీ బెంగళూరు(05952) స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 2.10గంలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది. ఈ స్పెషల్ జూలై 4 నుంచి అక్టోబర్ 31 వరకు పొడిగించారు. ఎస్ఎంవీ బెంగళూరు–న్యూటిన్‌సుకియా(05951) స్పెషల్ ప్రతి సోమవారం(ఆదివారం మధ్యరాత్రి) తెల్లవారు 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూటిన్ సుకియా వెళ్తుంది. ఈ స్పెషల్ జూలై 8 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు పొడిగించారు.

చట్టాల పేర్లు మార్చడం సహేతుకం కాదు

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరావు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విశాఖ లీగల్ : పోలీస్, న్యాయవ్యవస్థలను బలోపేతం చేయకుండా చట్టాల పేర్లు ఇంగ్లిష్ నుంచి హిందీలోకి మార్చడం సహేతుకం కాదని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయరావు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ప్రకాశరావుపేటలోని జిల్లా కోర్టు గేటు ఎదుట గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)లోని మూడు కీలకమైన క్రిమినల్ చట్టాలను కేంద్రం వివాదాస్పదంగా మారుస్తోందని విమర్శించారు. గతేడాది పార్లమెంటు సమావేశంలో ఈ మూడు కీలక చట్టాల్లో మార్పులు చేస్తూ చట్టాల పేర్లు కూడా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టి, చర్చ జరపకుండా రాష్ట్రపతి ఆమోదం చేయించి, ప్రస్తుతం అమల్లోకి తీసుకొస్తుందన్నారు. అనాదిగా ఇంగ్లిష్ పేర్లతో కొనసాగుతున్న ఈ చట్టాలు హిందీలో పేరు పెట్టడం వెనక సహేతుకమైన కారణం లేదని తెలిపారు. దీనివల్ల దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో న్యాయవ్యవస్థ అనేక సవాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దేశంలో ఇటీవల హింసాత్మక నేరాలు, సైబర్ నేరాలు ,మాదకద్రవ్యాలకు సంబంధించి నేరాలు, మహిళలపై దాడులు కూడా పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నేరాల సంఖ్య తగ్గించే విధంగా పోలీస్ వ్యవస్థలను బలోపేతం చేసి సత్వర న్యాయం బాధితులకు జరిగేలా చూడాలని సూచించారు. వీటి మీద దృష్టి పెట్టకుండా ప్రభుత్వం చట్టాలకు మార్పు తేవడం వల్ల గాని, పేర్లు మార్చడం వల్ల గాని ఎటువంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. ఈ చట్టాల అమలును అఖిల భారత న్యాయవాదుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు అల్లు సురేష్ కుమార్, కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లంబింగ్‌లో నిరుద్యోగులకు శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు సుమారు 3 నెలల పాటు ప్లంబింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పీఎంకేవీవై) పథకం కింద అభ్యర్థులందరికీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న నేక్ శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇస్తామని, వివరాలకు 9866883199కు ఫోన్ చేయాలన్నారు.

పెంపుడు కుక్కలతోనూ జాగ్రత్త!



- వాటి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలి
- ఏటా వ్యాక్సినేషన్ తప్పనిసరి
- కాటేస్తే తక్షణమే రేబిస్ టీకా
- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే..
- భీమిలిలో కుక్క కాటుకు బలైన యువకుడు
- పెంపకందార్లను హెచ్చరిస్తున్న పశువైద్యులు

సాక్షి, విశాఖపట్నం: పెంపుడు కుక్కలంటే కడుపున పుట్టిన పిల్లల మాదిరిగానే చూసుకుంటారు. వాటిపై ఎనలేని ప్రేమాభిమానాలను చాటుకుంటారు. కొందరు ప్రాణంతో సమానంగా, అవే సర్వస్వంగా భావిస్తారు. మరికొందరు కుటుంబంలో ఒకరిగా మెలిగే పెంపుడు శునకాలతో మమేకమవుతూ జీవిస్తారు. అలాంటి కుక్కలు ఒక్కోసారి ప్రేమతోనో, కోపంతోనో కాటేస్తుంటాయి. అలాంటప్పుడు తక్షణమే రేబిస్ ఇంజక్షన్లు వేయించుకుంటే సరే. ఏమీ కాదులే అని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. తాజాగా భీమిలిలో పెంపుడు కుక్క కాటుకు ఓ యువకుడు బలైన నేపథ్యంలో పెంపుడు కుక్కల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎంత అప్రమత్తంగా ఉండాలి? అన్న అంశం చర్చనీయాంశమైంది.

భీమిలికి చెందిన ఆర్టీసీ కండక్టరుగా పనిచేసిన నర్సింగరావు ఇంట్లో కొన్నాళ్లుగా కుక్కను పెంచుకుంటున్నారు. ఆ శునకం నర్సింగరావు 27 ఏళ్ల కుమారుడు భార్గవ్‌ను కొద్దిరోజుల క్రితం ముక్కుపై కరిచింది. అయితే దానిని తేలిగ్గా తీసుకున్న భార్గవ్ సకాలంలో చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో రేబిస్ వ్యాధి సోకడంతో పరిస్థితి విషమించి చనిపోయాడు. అప్పటికే పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి నర్సింగరావు కూడా షాక్‌కు గురై మరణించాడు. ఇలా ఆ ఇంట పెంపుడు శునకం పెను విషాదాన్ని నింపింది. ఈ ఘటన నేపథ్యంలో పెంపుడు కుక్కల పట్ల కుటుంబ సభ్యులు వ్యవహరించాల్సిన తీరును పశు వైద్యులు సూచిస్తున్నారు.

సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకుతుందన్న భావన ఉంటుంది. అయితే వీధి కుక్కలే కాదు.. పెంపుడు కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ఏ కుక్క కరిచినా వెంటనే వైద్యుని వద్దకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయించుకోవాలి. లేనిపక్షంలో కరిచిన శరీర భాగాన్ని బట్టి తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం సోకుతుంది. నాలుక, గొంతు పనిచేయకుండా, ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. నీరును చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాంతకమవుతుంది. కరిచింది మన ఇంట్లో కుక్కే కదా? ఏమీ కాదులే అన్న భావనను వీడి తక్షణమే చికిత్స చేయించుకోవాలని పశు వైద్యులు పేర్కొంటున్నారు. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్త తీసుకోవాలని సూచిస్తున్నారు.

రేబిస్ సోకిన కుక్క లక్షణాలిలా..

కరచిన (పెంపుడు/వీధి) కుక్క లక్షణాలను 14 రోజుల పాటు పరిశీలించాలి. ఈ రేబిస్ వ్యాధి సోకిన పెంపుడు కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఆహారం సరిగా తీసుకోదు. చిన్న చిన్న వస్తువులను, కుటుంబ సభ్యులను సైతం కరుస్తుంటుంది. తరచూ నోటి నుంచి సొంగ కారుస్తుంటుంది. ఇలాంటి లక్షణాలున్న కుక్కలను ఆస్పత్రికి తీసుకెళ్లి తగిన చికిత్స అందించాలి. లేనిపక్షంలో రేబిస్ వ్యాధి సోకిన కుక్క 14 రోజుల్లోనే చనిపోతుంది.

యాంటీ రేబిస్ వాక్సిన్లు పుష్కలం

జిల్లాలో సుమారు ఎనిమిది వేలకు పైగా పెంపుడు కుక్కలున్నాయి. వీటిలో మూడు వేలు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఐదు వేల వరకు శునకాలు నగర పరిధిలోనూ ఉన్నాయి. వీటికి ఏడాది ఒకసారి వ్యాక్సిన్లు వేయించడం తప్పనిసరని పశు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు (ఏఆర్‌వీలు) పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. ఏ కుక్క కాటేసినా అశ్రద్ధ చేయకుండా తక్షణమే చికిత్స చేయించుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలని సూచించారు. జులై 6న ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కల పట్ల ఎలా వ్యవహరించాలి? కుక్కలకు రేబిస్ వ్యాధి సోకడం, ఏటా వ్యాక్సిన్లు వేయించుకోవలసిన ఆవశ్యకతలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.



తాళ్లవలస పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కకు టీకా వేయిస్తున్న యజమాని

ఎడ్‌సెట్‌లో అమ్మాయిల సత్తా

కొమ్మాది, సబ్బవరం: ఏపీ ఎడ్‌సెట్–2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. బయోలాజికల్ సైన్స్ విభాగంలో జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌కు చెందిన పప్పల మానస సాయిలక్ష్మి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించారు. అలాగే పీజీ సెట్‌లో జువాలజీ విభాగంలో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్సీ జువాలజీ చేయాలనేది తన లక్ష్యమని వివరించారు. ఆమె తండ్రి పప్పల రామచంద్రరావు ప్రైవేట్ ఉద్యోగి. తల్లి మంగమ్మ గృహిణి. సాయిలక్ష్మి 1 నుంచి 10వ తరగతి వరకు విజ్ఞాన్ తిమ్మాపురంలో, ఇంటర్ చైతన్య, డిగ్రీ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో అభ్యసించారు. ఇక ఇంగ్లిష్ విభాగంలో దసపల్లా హిల్స్‌కు చెందిన దేబాంజన తలూక్‌దర్ మూడో స్థానంలో నిలిచింది. అలాగే ఇంగ్లిష్ మెథడాలజీలో సబ్బవరంలోని షిర్డీనగర్ కాలనీకి చెందిన బొడ్డు ఈక్షిత నాయుడు రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్ సాధించారు. ఆమె తండ్రి లక్ష్మణరావు ఆర్టీసీ ఉద్యోగి. అధ్యాపకురాలిగా పనిచేయడమే తన లక్ష్యమని ఈక్షిత తెలిపారు.



మానస సాయి లక్ష్మి



ఈక్షిత నాయుడు

టోల్ బూత్‌ల తొలగింపు

టోల్‌ప్లాజా వసూళ్ల నిలుపుదల

అగనంపూడి: దశాబ్ద కాలం పాటు వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన అగనంపూడి టోల్‌ప్లాజా ఫీజుల వసూళ్లకు ఫుల్‌స్టాప్ పడింది. స్థానిక నేతలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నాలుగు టోల్‌బూత్‌లను పొక్లెయిన్‌తో తొలగించారు. సుమారు 12 ఏళ్ల నుంచి అగనంపూడి టోల్‌ప్లాజాను తొలగించాలని స్థానికులు ఆందోళనలు చేస్తున్నారు. 2019లో హైకోర్టు ఆదేశాలతో టోల్‌ఫీజు వసూళ్లకు ఫుల్‌స్టాప్ పడింది. అయితే కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై సుప్రీంకోర్టులో కేసు వేయడం, స్టే తెచ్చుకుని మళ్లీ యథావిధిగా టోల్‌ప్లాజాను కొనసాగించారు. అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తర్వాత ఇక్కడి టోల్ ప్లాజాను తొలగిస్తామని అప్పట్లో సుప్రీం కోర్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే అనకాపల్లి సబ్బవరం మధ్యలో టోల్ ప్లాజాను ఏర్పాటు చేసిన తర్వాత కూడా ఇక్కడ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక నాయకులు టోల్‌ప్లాజాను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న టోల్‌ప్లాజాను తొలగిస్తామని రెండు రోజుల కిందట ఆందోళనకు దిగిన నాయకులు.. బుధవారం అర్ధరాత్రి తర్వాత టోల్ బూత్‌లను దగ్గరుండి తొలగింపజేశారు. బూత్‌ల్లో ఉన్న కంప్యూటర్లను సిబ్బంది జాగ్రత్త పరిచిన తర్వాత.. బూత్‌లను నేలమట్టం చేశారు. బూత్‌ల వద్ద ఉన్న ఇనుప గేట్లను కూడా తొలగించారు. ఇదిలా ఉంటే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా దౌర్జన్యంగా తొలగింపు చర్యలు చేపట్టడం చట్ట విరుద్ధమని హైవే అథారిటీ అధికారులు చెబుతున్నారు. తొలగించిన విషయాన్ని ప్రాజెక్టు అధికారులకు తెలియజేశామని.. తదుపరి అధికారుల నిర్ణయం మేరకు వ్యవహరిస్తామని ఇక్కడి అధికారులు తెలిపారు.



బూత్‌ల తొలగింపు అనంతరం టోల్‌ప్లాజా

నాణ్యమైన ఉత్పత్తులపై అవగాహన



మాట్లాడుతున్న రమాకాంత్ సాగర్

బీచ్‌రోడ్డు: బీఎస్‌ఐ 2016 చట్టం గురించి అవగాహన పెంచుకోవాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఉత్పత్తుల నాణ్యతపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు, తయారీదారులకు ప్రతి నెలా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎస్‌ఐ మార్క్ వస్తువులు, నిర్వహణ వ్యవస్థ, ధ్రువీకరణపై వివరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రదీప్ షెకావత్, ఆశిష్ కన్నార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

పెదగంట్యాడ: మండలంలోని గంగవరం రోడ్డులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. న్యూపోర్టు ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ మండలం గంగవరం గ్రామానికి చెందిన అర్జిలి సతీష్‌కుమార్ (28), అదే ప్రాంతానికి చెందిన అర్జిలి దేముడు (25), చోడిపల్లి రమేష్ (34) గంగవరం రోడ్డులోని కొంగ పైడితల్లమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన ద్విచక్రవాహనాలను ఆపి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో గంగవరం నుంచి వేగంగా వస్తున్న కారు ఆ ముగ్గురినీ ఢీకొంది. దీంతో ఆ ముగ్గురిలో ఒకరైన అర్జిలి సతీష్ కుమార్ కాలు విరిగిపోయింది. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అటుగా వెళ్తున్న వారు చూసి గాయపడిన వారిని గాజువాకలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారుతో పాటు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మడగాపు జగదీశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అర్జిలి సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు.. పక్కనే పడి ఉన్న ద్విచక్రవాహనాలు

పిల్లలను ఇంటికి తీసుకురాకుండానే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొన్న బైకర్



వెంకటరమణ(ఫైల్)

కొమ్మాది: ట్యూషన్‌కు వెళ్లిన తమ పిల్లలను తీసుకొచ్చేందుకు బయలుదేరిన ఓ తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. దీంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. బీచ్‌రోడ్డులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి గొల్లలపాలెంలో చందక వెంకటరమణ(42) తన భార్య రమాదేవి, కుమారుడు మహిధర్, కుమార్తె దీక్షితతో కలసి నివాసం ఉంటున్నారు. వెంకటరమణ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు పిల్లలు భీమిలిలో ప్రతి రోజూ ట్యూషన్‌కు వెళ్తుంటారు. యథావిధిగా బుధవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలను తిరిగి ఇంటికి తీసుకొచ్చేందుకు వెంకటరమణ బైక్‌పై బయలుదేరారు. ఉప్పాడ జంక్షన్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా కోలా ప్రశంగి అనే వ్యక్తి బైక్‌పై రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి.. వెంకటరమణ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనువెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు మృతి చెందాడు. అందరితోనూ సరదాగా ఉంటూ.. అందరికీ సహాయం చేసే వెంకటరమణ అకాల మరణాన్ని కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, ఆయన స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంకటరమణ మృతితో గొల్లలపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. అతని భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రమేష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

గోపాలపట్నం: ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యమైంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ..మాధవధార సీతన్నగార్డెన్ కళింగనగర్‌లో నివాసం ఉంటున్న మీసాల వెంకటనాయుడు వద్దే అతని కుమార్తె వై.సుస్మిత ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కౌశిక్ నాయుడు, ప్రణీత్ ఉన్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువుల ఇంట్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





సుస్మిత, కౌశిక్, ప్రణీత్ (ఫైల్)

రైవాడలో గిరి నాగు హల్‌చల్



రైవాడలో గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: మండలంలోని రైవాడలో భారీ గిరి నాగు హల్‌చల్ చేసింది. రైవాడ ఎస్సీ కాలనీలోని ఓ పూరి గుడిసెలో గురువారం గిరి నాగు ప్రవేశించింది. సుమారు 12 అడుగుల పొడవుతో తాటాకుల మధ్య తిష్ట వేసింది. బుసలు కొడుతున్న చప్పుడు రావడంతో గుడిసెలో నివాసం ఉంటున్న వారు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు ఫారెస్టు అధికార్ల ద్వారా స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. ఆయన సుమారు గంట పాటు శ్రమించి గిరినాగును పట్టుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు


సబ్బవరం: బాలకార్మికులతో పనులు చేయించడం నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ పేర్కొన్నారు. బాల కార్మికుల నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా సబ్బవరం మండలంలోని పలు షాపుల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. సబ్బవరంలోని జోడుగుళ్ల జంక్షన్ వద్ద వినాయకుడు బొమ్మల తయారీ కేంద్రంలో 14 ఏళ్లలోపు బాలకార్మికుడు పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు. బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, యజమాని వరదరామ్ బవిరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో సీడీపీవో లలిత కుమారి, ఎస్‌ఐ ధనుంజయ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పైడితల్లి, స్వర్ణ, సీడ్స్ జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజు, బాలల పరిరక్షణ అధికారి లోవరాజు పాల్గొన్నారు.



బాల కార్మికుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ

నిలిచిన పాపికొండల విహారం

గోదావరికి వరద పోటు



పోశమ్మగండి వద్ద గోదావరి నీటిమట్టం

దేవీపట్నం: తుఫాను ప్రభావంతో నదిపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొండవాగుల ద్వారా గోదావరిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో పోశమ్మగండి వద్ద నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మూడు రోజులుగా సుమారు నాలుగు అడుగులు పెరిగినట్టు పరిసర ప్రాంతీయులు చెబుతున్నారు. ఇలా ఉండగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో పోశమ్మగండి నుంచి పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి నిలిపివేశారు.

వీఆర్‌పురం: తుఫాను కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోట్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు బోట్ యూనియన్ నాయకులు తెలిపారు.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గత నెల 7వ తేదీ నుంచి ఈనెల 27వ తేదీ వరకు రూ. 50,01,327ల నగదు, 30 గ్రాముల బంగారం, కేజీ 200 గ్రాముల వెండి భక్తులు సమర్పించినట్టు ఈవో బండారు ప్రసాద్ చెప్పారు.

ఈ నగదును గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

త్రిశంకు స్వర్గంలో..

విమల విద్యాలయం భవిష్యత్

- తరగతి గదుల్లో విద్యార్థులు
- ఆందోళన బాటలో టీచర్లు
- ఉక్కు యాజమాన్యం నిర్ణయంపై ఎదురుచూపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. పాఠశాలకు వస్తున్నారు గానీ తరగతులు జరగడం లేదు. ఉపాధ్యాయులు పాఠశాల బయట ఆందోళన కొనసాగిస్తున్నారు. పాఠశాల నిర్వహణపై ఉక్కు యాజమాన్యం నుంచి నిర్ణయం వచ్చే వరకు ఇలానే పరిస్థితి కొనసాగనుంది.

సుమారు 40 ఏళ్ల కిందట నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు, బలహీన వర్గాల కోసం ఉక్కునగరంలో విశాఖ విమల విద్యాలయంను నాటి యాజమాన్యం ఏర్పాటు చేసింది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సాయంతో నగరానికి చెందిన ఆర్‌సీఎం డైయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నడుస్తోంది. ఇందులో శాశ్వత ఉపాధ్యాయులు 30 మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ 10 మందితో పాటు అవుట్ సోర్సింగ్‌తో కలిపి మొత్తం 70 మంది విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు అందిస్తున్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు ఉన్న పాఠశాల నిర్వహణకు ఉక్కు యాజమాన్యం ఏటా రూ. 6కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ప్రతీ ఐదేళ్లకు ఓసారి ఉక్కు యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగే ఎంవోయూ మేరకు పాఠశాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఎంవోయూ ఈ ఏడాది మే 31తో ముగిసింది. ప్రస్తుత స్టీల్‌ప్లాంట్ గడ్డు పరిస్థితుల నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం బిల్డింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఆర్థిక వనరులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించింది. ఈ మేరకు కొత్త ఎంవోయూ చేసుకునేందుకు సన్నద్ధమైంది. పాత పద్ధతిలో మాత్రమే వేతనాలు చెల్లించగలమని, ఫీజుల పెంపు వంటి వాటి ద్వారా తాము కొనసాగించలేమని పాఠశాల యాజమాన్యం చేతులెత్తేసింది. దీంతో జూన్ 13న పాఠశాలను మూసి వేశారు.

ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తరగతులకు అనుమతించినప్పటికీ.. ఎంవోయూ జరిగే వరకు తరగతులకు హాజరుకావద్దని ఉపాధ్యాయులకు ఆదేశించింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో కాలక్షేపం చేస్తుండగా.. ఉపాధ్యాయులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు అవుట్ సోర్సింగ్ సిబ్బందితో మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. కాగా.. ఉపాధ్యాయుల ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు మద్దతు ఇస్తున్నారు.



ఉక్కు విమల విద్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

ఉక్కు యాజమాన్యం నిర్ణయం పైనే..

ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు ఉక్కు యాజమాన్యంతో ఓ దఫా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో యాజమాన్యం తాజా పరిస్థితిని వివరించింది. కాగా.. ఉపాధ్యాయులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను కలిసి తమ గోడును విన్నవించారు. ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. సీఎండీకి లేఖ పంపారని ఉపాధ్యాయులు తెలిపారు. ఉక్కు యాజమాన్యం నిర్ణయం కోసం అటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉక్కు యాజమాన్యం తీసుకునే నిర్ణయంపైనే విమల విద్యాలయం భవిష్యత్ ఆధారపడి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

పాత పద్ధతిలో పాఠశాల నిర్వహించాలి



15 రోజులుగా మేము ఆందోళన చేస్తున్నాం. ఈ అంశంపై ప్లాంట్‌కు చెందిన కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు మాకు మద్దతుగా నిలుస్తున్నారు. వెంటనే ఉక్కు యాజమాన్యం చొరవ చూపి పాఠశాలను నడిపించాలి.

–బి.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

మా చదువుల పరిస్థితి ఏంటి?



పాఠశాలకు వస్తున్నాం కాని తరగతులు కావడం లేదు. ఎవరో వచ్చి ఏదో చెప్పి పోతున్నారు. ఇలా ఐతే మాకు సిలబస్ ఎలా పూర్తవుతుంది. మేము పరీక్షలు ఎలా రాయగలం. పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించాలి.

– హర్షిణి, 10వ తరగతి విద్యార్థిని